# ప్రజా మంచేలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 173 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 24 - 12 - 2025




## బంగ్లాదేశ్ లో అరాచకం... మళ్లీ సైనిక పాలన భయాలు!

### ప్రతి పైసా ఖర్చు
# ప్రజల కోసమే

- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామన్న ఉపముఖ్యమంత్రి
- రెండేళ్లుగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు
- ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ఆగ్రహం
- తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు
- కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నాడని వ్యాఖ్య



రెండేళ్లుగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి

- మిగతా 2 లో

### దొంగచాటుగా ఏం చేస్తున్నావో
# బహిర్గతం చెయ్యి



- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవోలను దాచిపెడుతోందని హరీశ్ రావు ఆరోపణ
- 13 నెలల కాలంలో 82 శాతం జీవోలను రహస్యంగా ఉంచారని విమర్శ
- జీవోల గోప్యతపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్య
- చీకటి జీవోల మాటున ఏం చేస్తున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) ప్రజలకు అందుబాటులో ఉంచకుండా దాచిపెడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాల్లోగా బహిర్గతం చేయాలని హైకోర్టు ఇచ్చిన

- మిగతా 2 లో

### ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో
## రేవంత్ బిజీగా ఉన్నారు



2 లో

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- పజలకు ఉపయోగపడే పనులు రేవంత్ చేయడం లేదన్న కేటీఆర్
- మీడియాకు లీకులిస్తూ ప్రజలు దృష్టిని మళ్లిస్తున్నారని విమర్శ
- సాగునీటిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపాటు

### వైకుంఠ ద్వార దర్శనాలపై
# వదంతులు నమ్మొద్దు



- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టత
- డిసెంబర్ 30, 31, జనవరి 1న ఈ-డిప్ టోకెన్లు ఉన్నవారికే దర్శనం
- జనవరి 2 నుంచి 8 వరకు టోకెన్లు లేనివారికి సర్వదర్శనం
- టోకెన్లు లేకున్నా తిరుమలకు రావొచ్చని స్పష్టం చేసిన టీటీడీ
- దర్శనాల షెడ్యూల్‌పై ఆయన స్పష్టతనిస్తూ, భక్తులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని కోరారు
- భక్తుల రద్దీని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విస్తృత ఏర్పాట్లు

తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను భక్తులు నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞ

- మిగతా 2 లో

### ఫోన్ ట్యాపింగ్ కేసులో
# కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు!

- స్వాగతించిన బండి సంజయ్
- సిట్ నిర్ణయాన్ని స్వాగతించిన కేంద్రమంత్రి బండి
- ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపణ
- టీవీ సీరియల్స్ పూర్తయ్యాయి, కానీ కేసు తేలలేదన్న విమర్శ
- విచారణ అధికారులకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్



తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించింది. ఈ నిర్ణయంపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, దీనిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు

- మిగతా 2 లో

### శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2
# మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

- అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6
- శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
- ఉదయం 8.54 గంటలకు నింగిలోకి బ్లూబర్డ్-6 ఉపగ్రహం రాకెట్
- ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు
- శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్



కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని,

- మిగతా 2 లో

### రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో
# ఏసీబీ సోదాలు

- ఆకస్మిక తనిఖీల్లో 4 చోట్ల క్రిమినల్ కేసులు ఏసీబీ అధికారులు నమోదు
- విశాఖ, విజయనగరం,అనంతపురం, ఎన్టీఆర్ 4 జిల్లాల్లో ఏసీబీ సోదాలు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఇళ్లలో సోదాలు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అనిశా అధికారుల విచారణ
- పలు కీలక పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకాలు, ఆస్తుల దస్తావేజులు స్వాధీనం
- విశాఖ జగదాంబ సెంటర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కేసు నమోదు




రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఆకస్మిక తనిఖీల్లో 4 చోట్ల క్రిమినల్ కేసులు ఏసీబీ అధికారులు నమోదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి చెందిన 14 ఇళ్లలో సోదాలు చేపట్టారు. నవంబరు 5, 6 తేదీల్లోనూ పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. గత నెలలో సిబ్బంది నుంచి అధికారులు పెద్దమొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ జగదాంబ సెంటర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కేసు నమోదు చేశారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ మోహనరావు,

- మిగతా 2 లో

### ఐటీ విప్లవం తర్వాత
# క్వాంటం విప్లవం

- క్వాంటమ్ వ్యాలీగా అమరావతి
- ఏపీ సీఎం చంద్రబాబు
- అమరావతిని భారత క్వాంటం వ్యాలీగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్న సీఎం
- వచ్చే రెండేళ్లలో ఏపీలోనే క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు ఉత్పత్తి చేస్తామని ప్రకటన
- లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయాలనేది ప్రభుత్వ ప్రణాళిక అన్న చంద్రబాబు
- విశాఖ డేటా సెంటర్ల గ్లోబల్ హబ్‌గా మారుతోందని వ్యాఖ్య
- క్వాంటం, ఏఐ, గ్రీన్ హైడ్రోజన్‌తో ఫ్యూచర్ రెడీ ఏపీ నిర్మాణమని వెల్లడి
- ఆధునిక పరిశోధనల కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఉంటుందన్న సీఎం చంద్రబాబు




ప్రస్తుతం అందరూ క్వాంటమ్ టెక్నాలజీ గురించే ఆలోచిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆధునిక పరిశోధనల కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఉంటుందని చెప్పారు. దేశంలోనే తొలిసారి అతిపెద్ద క్వాంటమ్ విద్యాసదస్సు ద్వారా విద్యార్థుల్లో నైపుణ్య కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వేలాది టెక్ విద్యార్థులతో ఆన్‌లైన్‌లో 'క్వాంటమ్ టాక్' నిర్వహించిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ పని చేయబోతోందన్నారు. క్యూబిట్, వైసర్ సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్వాంటమ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం 50 వేల మంది విద్యార్థులు, ఐటీ రంగ ఉద్యోగులు రిజిష్టర్ చేసుకున్నారు. వీరిలో 51 శాతానికి పైగా మహిళా టెక్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

- మిగతా 2 లో

# సంపాదకీయం

## థియేటర్ సినిమాలు కనుమరుగవుతాయా

నా చిన్నప్పుడు 'లవకుశ' సినిమా చూసేందుకు బండ్లు కట్టుకొని ప్రజలు తండోపతండాలుగా గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చేవారు. అలాంటి సినిమాలు చూసిన తరువాత తమ జీవితం ధన్యమైందని అనుకొనేవారని ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు! సామాన్యుడికి ఆనాడు సినిమా చూసేందుకు 'పావలా' నేల టికెట్ సరిపోయేది! నేడు బ్లాకులో మల్టీప్లెక్స్‌లో సినిమా చూసేందుకు, అక్కడ పాప్‌కార్న్ లాంటి ఖరీదైన తినుబండారాలు కొనుక్కునేందుకూ, ఇంటిల్లిపాదికీ వేలకు వేలు ఖర్చు అవుతున్నాయి!ఆనాటి సినిమాల్లో నవరసాలతో పాటు జనానికి అర్థమయ్యే రీతిలో ఆచరణకు వీలైన చిన్నపాటి సందేశం కూడా ఉండేది! డబ్బులు చేసుకోవటానికే ఆనాటి నిర్మాతలు సినిమాలు తీసేవారు, కానీ పూర్తిగా సినిమాల ద్వారానే వందకు వంద శాతం లాభాలు పొందాలనే పేరాశతో వ్యవహరించక పోయేవారు! ప్రేక్షకులకు వినోదంతో పాటు కలకాలం జ్ఞాపకం ఉంచుకొనే నడవడికనూ, ఏది మంచీ ఏది చెడూ అనే విచక్షణా జ్ఞానాన్ని అప్పటి సినిమాలు అందించేవి! కుటుంబగాథలు, జానపద నాయకుల వీరోచిత సాహసాలూ, క్రూరత్వం ప్రదర్శించిన విలన్లు చివరకు హీరోల చేతుల్లో చావక తప్పదనే నీతితో కూడుకున్న న్యాయం ఉండేది. పౌరాణిక గాథలు- అందులో నటించిన కృష్ణుడు, రాముడు కాలెండర్లను పూజగదుల్లో పెట్టుకొనే రీతిలో సినిమాలు నిర్మాణమయ్యేవి! ఒకటో రెండో 'క్లాస్' సినిమాలను నిర్మాతలు అభిలాషతో తీసినా, కొద్దిపాటి నష్టంతో బయటపడేవి. అలాంటి వాటికి ప్రభుత్వ సాయంతో పాటు, అవార్డులు కూడా దక్కేవి!ఇప్పటి సినిమా నిర్మాణాలూ, ప్రేక్షకుల ఇక్కట్లూ, ఫ్యాన్స్ అనవసరంగా చేసే హడావిడి వల్ల కలిగే రాద్ధాంతాలూ, శాంతిభద్రతల సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు! పేరు తెచ్చుకున్న ఇప్పటి సినిమాలో కూడా ప్రేక్షకుడు రెండున్నర గంటల సినిమాను వీక్షించటానికి నానా హైరానా పడుతున్న తరుణంలో... సినిమా క్రమేపీ సామాన్యుడికి దూరమవుతున్నదా? అని ఆలోచించక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది. ఇందుకు కారణం ఎవరు?మల్టీప్లెక్స్ థియేటర్ల రాకతో మామూలు థియేటర్లు మరుగునపడుతున్నాయి. కొన్ని పట్టణాలలో, టౌన్లలో సినిమా హాళ్ళు ఫంక్షన్ హాళ్ళుగా మారుతున్నాయి. ఇళ్లల్లో కూర్చొని, ఓటీటీ ద్వారా వచ్చే సినిమాలు టీవీలలో చూస్తే పోలా!... అనుకుంటున్న ప్రేక్షకుడిని మళ్ళీ సినిమా హాళ్ళకి తీసుకొని వచ్చి, సినిమాలు చూసే పరిస్థితి కల్పించగలరా? మన దేశంలో సినిమా పెద్దలు ఏరోజుకారోజు లెక్కలు చూసుకొని సరిపెట్టుకుంటున్నారు. పాన్ ఇండియా సినిమాలు నిర్మిస్తే అంతకంటే కావల్సింది ఏముంది అన్న మోహంలో పడిపోయారు. సాధారణ సినిమాలు జనరంజకంగా తీయొచ్చు అన్న సంగతి గాలికి వదిలేశారు. హీరోలు, దర్శకులు ఒకటి రెండు సినిమాలతో కోటీశ్వరులు కావచ్చని, సినిమా అంటే డబ్బు వచ్చే సోర్స్ అనే భ్రాంతిలో పడిపోయారు. సగటు ప్రేక్షకుడిని మర్చిపోయారు.టీవీల రాకతో, చానెళ్ళ ఆకర్షణలతో, దృశ్యానుభూతితో పుస్తకాలు చదవటం కాలక్రమేణా కనుమరుగయింది. గొప్పల కోసం ఇంగ్లీషు పుస్తకాలు చదువుతున్నట్లుగా చెప్పుకుంటున్నారు కానీ, తెలుగు మరీ పలచనైపోయి, కేవలం స్కూళ్ళల్లో పాఠ్యపుస్తకాలకే పరిమితమైంది. మారుతున్న సమాజం తీరును ఎవరూ తప్పుపట్టలేరు. కాలానుగుణంగా మార్పులతో ప్రజానీకం ముందుకు నడవక తప్పదు. అయితే పూర్తిగా విలువలు మృగ్యమయ్యే రీతిలో ప్రస్తుత సమాజం వ్యవహరిస్తే భవిష్యత్తులో నష్టపోయేది వారి వారసులే. భాష అనేది భావాన్ని వ్యక్తపరిచే సాధనం. కానీ మనిషిలో నుంచి సహజ తీరులో భావ సంపదను అమర్చుకుంటూ వచ్చే భాష బదులుగా, సంబంధంలేని భాషను పనిగట్టుకొని నేర్చుకోవడమే గొప్ప అనుకొని ప్రవర్తిస్తే నష్టపోయేది మనమే! ఈ ఇంగిత జ్ఞానం వదులుకోకూడదు! 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు ఊరకే చెప్పలేదు! 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని మరొకరు ఊరకనే పొగడలేదు! అన్ని భాషలను ఆదరిస్తున్న తీరులోనే స్వంత భాషను మెరుగ్గా ఆదరిస్తే - మన గుర్తింపును (ఐడెంటిటీని) మనం కోల్పోకుండా ఉంటాం. మన సంస్కారాన్ని, విలువలను, భావితరాల కోసం నిలబెట్టుకున్న జాతిగా మనగలుగుతాం.భాష మాదిరే మన సినిమాను కూడా కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వినోదం కోసం చూసే సినిమా ఆర్థిక విషాదం కల్పించకూడదు. అందని ద్రాక్షపండులా తెలుగు సినిమాను ఈ తరం నిర్మాతలూ, దర్శకులూ, నటులూ మార్చటం... సినీ రంగానికి ద్రోహం చేయడమే. కాలక్షేపం కోసం అర్రులు చాచే సామాన్య జనానికి ఉన్న ఒకే ఒక ప్రయోజనాన్ని, అందుబాటులో ఉన్న వినోద సాధనాన్ని గుంజుకొనే వారు ఎంతగొప్పవారైనా, కళామతల్లి ముద్దుబిడ్డలుగా పొగడ్తలను మూటగట్టుకుంటున్న వారైనా సరే - గర్హనీయులే.పాశ్చాత్య దేశాల్లో కూడా కొంతకాలం పాటు పుస్తకాలు అటకెక్కాయి! టీవీల నీడల్లో అనాదరణకు లోనయ్యాయి. కానీ ప్రస్తుతం కోల్పోయిన ఆదరణను అవి తిరిగి పొందుతున్నాయి. సినిమా విషయంలో హాలీవుడ్‌ను కూడా ప్రశ్నించే విధంగా నెట్‌ఫ్లిక్స్ - వార్నర్ డీల్ కుదిపేస్తున్నది. అసలు సిసలైన సినిమాలకు రూపకల్పన చేసే హాలీవుడ్ పరిశ్రమ కుదేలవుతున్నదా? అన్నదే ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఈ డీల్ కుదిరితే ప్రేక్షకులు కోరుకునే సినిమా కాలగర్భంలో కలిసిపోతుంది. స్వతంత్ర పోకడలతో నిర్మాణాత్మకంగా తీసే సినిమాలకు నీళ్ళొదులుకోవాల్సిందే. సినిమాలు చూడటానికి క్యూ కట్టే సగటు ప్రేక్షకులకు నిరాశ తప్పదు. పారామౌంట్ లాంటి సంస్థ ఈ డీల్‌ను తీవ్రంగా ఖండిస్తోంది. సినిమాలు చూసేవారికి థియేటర్ల కాలక్షేపం అందుబాటులో ఉండని పరిస్థితి అక్కడా ఏర్పడనున్నదా? అమెరికన్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ కూడా ఈ డీల్ సినిమా ప్రేక్షకులకు ప్రమాదకారిగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. న్యాయస్థానాలు కల్పించుకొనే అవకాశంతో పాటు, ఈ సమస్యను ఏ విధంగా సామరస్యపూర్వకంగా పరిష్కరించాలన్న ఆలోచనల్లో అక్కడి విజ్ఞులు ఉన్నారు. ఇక్కడ కూడా సినిమా ప్రేక్షకుల మంచి చెడ్డలు చూస్తున్న మేధావులు, సామాజిక కార్యకర్తలు, పాలకులూ కలగజేసుకొని సినిమాను సామాన్యుడికి అందుబాటులోకి తెస్తారని ఆశిద్దాం.

## ఐటీ విప్లవం తర్వాత క్వాంటం విప్లవం

**మొదటిపేజీ తరువాయి** - రాష్ట్రంలో క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రోడ్ మ్యాప్‌ను సీఎం చంద్రబాబు విద్యార్థులకు వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 3 వేల మందికి తదుపరి స్థాయి శిక్షణ, వంద మందికి ఐబీఎం, టీసీఎస్ సహా సీడాక్‌లో శిక్షణ అవకాశాలు లభించాయి. ఏపీ నుంచి లక్ష మంది క్వాంటమ్ నిపుణుల్ని తయారు చేయడమే లక్ష్యంగా క్వాంటమ్ ప్రోగ్రామ్ పని చేయనుందని సీఎం వెల్లడించారు.1970లో చైనా ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిందని, 1991లో భారత్‌లో ఆ సంస్కరణలు వచ్చాయన్నారు. ఆ తర్వాత ఎక్కడా వెనక్కి తిరిగి చూడలేదని తెలిపారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలతో ఆర్థికాభివృద్ధికి ముందడుగు పడిందని సీఎం అన్నారు. హరిత విప్లవంతో దేశ స్థితిగతులు సమూలంగా మారాయని, ఆహార ధాన్యాల విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించిందని చంద్రబాబు వివరించారు. సామాన్యుల సాధికారతే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోందని, విశాఖకు చాలా ఐటీ కంపెనీలు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి ఆ నగరం చిరునామాగా మారబోతోందని, తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు చంద్రబాబు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపీని క్వాంటమ్‌తో పాటు గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తున్నామని సీఎం అన్నారు. వచ్చే 20 ఏళ్లలో రాష్ట్రాభివృద్ధిపై ఇప్పుడే కార్యరూపం ఇస్తున్నామన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ద్వారా ఒక ఎకో సిస్టమ్ తయారీ లక్ష్యమని, హరిత, పారిశ్రామిక విప్లవాల కంటే టెక్నాలజీతో సేవల రంగంలో విప్లవం సాధించామని పేర్కొన్నారు. అమరావతి నాలెడ్జ్ ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీగా ఉంటుందన్నారు.అనంతపురం, కడప ఎలక్ట్రానిక్స్ ఏరో స్పేస్ కేంద్రాలుగా ఉంటాయన్నారు. అతిపెద్ద పారిశ్రామిక కారిడార్లుగా విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు మారబోతుందన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా సంస్కరణలతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామన్నారు. డిజిటల్ ఇండియా, జీఎస్టీ లాంటి సంస్కరణలతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నట్లు సీఎం వివరించారు.రూ.వంద కోట్లు నజరానా: క్వాంటం టెక్నాలజీ ద్వారా ఎవరైనా నోబుల్ ప్రైజ్ అందిపుచ్చుకుంటే వారికి వంద కోట్లు నజరానా ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వ్యక్తిగత ఔషధాలు, ప్రివెంటివ్, క్యురేటివ్ హెల్త్‌ను క్వాంటం అప్లికేషన్ల ద్వారా అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సామర్థ్యాలు, వేగం, కచ్చితత్వం లాంటివి క్వాంటం టెక్నాలజీ ద్వారా సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఓ ట్రాన్స్‌ఫర్మేషనల్ ఛేంజ్ క్వాంటం ద్వారా సాధించేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ ను భారతీయులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఏ సాంకేతికత అయినా విప్లవమైనా ఏపీ సారథ్యం వహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.'ప్రస్తుతం అందరూ క్వాంటమ్ గురించే ఆలోచిస్తున్నారు. డీప్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. అమెరికాకు సిలికాన్ వ్యాలీ మాదిరిగానే భారత్‌కు క్వాంటమ్ వ్యాలీ. క్వాంటమ్ వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారతీయులే, అందులో ఏపీ నుంచి వెళ్లిన వారే అధికంగా ఉన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో మనదేశం అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది, 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది.' - చంద్రబాబు, ముఖ్యమంత్రి కుటుంబానికి ఒక ఐటీ నిపుణుడు: సైబరాబాద్ నిర్మాణం ద్వారా హైదరాబాద్ ఐటీ గ్లోబల్ హబ్‌గా ఎదిగిందని, విశాఖలోనూ ఇప్పుడు గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోందన్నారు. గతంలో ఐటీఈఎస్ లాంటి సేవలను వివిధ దేశాలకు ఇక్కడినుంచే అందించామన్నారు. ఇప్పుడు కూడా అలాగే ఇక్కడ నుంచే సీ కేబుల్ లాంటి వ్యవస్థ కూడా ఏర్పాటవుతుందన్నారు. 30 ఏళ్ల క్రితం ప్రతి కుటుంబం నుంచి ఒక ఐటీ నిపుణుడు ఉండాలని పిలుపునిచ్చానని, ఆ విజన్‌కు ముందుకొచ్చారు, ఇవాళ వారంతా సంతోషంగా ఉన్నారన్నారు. విద్యార్థులతో వైసర్ , క్యూబిక్ సంస్థల ప్రతినిధులు: క్వాంటమ్ టాక్ కార్యక్రమంలో వైసర్ క్యూబిక్ సంస్థల ప్రతినిధులు, వేలాది మంది టెక్ విద్యార్థులు వర్చువల్ గా హాజరయ్యారు. ఐఐటీ చెన్నై, తిరుపతి డైరెక్టర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి క్వాంటమ్ టెక్నాలజీలో చేపట్టబోయే ప్రాజెక్టులను వైసర్, క్యూబిక్ సంస్థల ప్రతినిధులు విద్యార్థులతో పంచుకున్నారు. క్వాంటమ్ టెక్నాలజీతో భవిష్యత్తులో రాబోయే మార్పులను ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి వివరించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ఏర్పాటుకు వేగంగా చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. నేషనల్ క్వాంటమ్ మిషన్ తరఫున ఏపీలోని ఇంజినీరింగ్ కళాశాలకు టీచింగ్ ల్యాబ్‌ల ఏర్పాటులో తోడ్పాటు అందిస్తామని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి అభయ్ కరాందికార్ తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాల

**మొదటిపేజీ తరువాయి** - ఇద్దరు సిబ్బంది ఇళ్లలో సోదాలు చేశారు. విజయనగరం జిల్లా భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కేసు నమోదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ పందిళ్లపల్లి రామకృష్ణ, ఐదుగురు సిబ్బంది ఇళ్లలో సోదాలు నిర్వహించగా అనంతపురం జిల్లా చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కేసు నమోదు చేశారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ ప్రసాద్‌బాబు, ఇతరులపై ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కూడా కేసు నమోదు చేశారు. ఇన్‌ఛార్జ్ సబ్‌రిజిస్ట్రార్ షేక్ మహమూద్, సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది ఇళ్లలో సోదాలు నిర్వహించారు.ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో విజయనగరం జిల్లా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. సబ్ రిజిస్ట్రార్ పందిళ్లపల్లి రామకృష్ణ సహా ఆరుగురు సిబ్బంది ఇళ్లలో తనిఖీలు చేసి పలు కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనధికార విధులు నిర్వహించే కనకరాజు ఇంటి నుంచి రూ.15 లక్షలు క్యాష్, 12 బ్యాంక్ పాసు పుస్తకాలతో పాటు ఆస్తుల దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. 20 రోజుల కిందట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేసిన తనిఖీల్లో అనిశా అధికారులకు, సబ్ రిజిస్ట్రార్‌కు చెందిన ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించిన కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ సహా మిగిలిన సిబ్బంది ఇళ్లల్లో ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ బాబు ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ బాబు అనంతపురంలో నివాసం ఉంటున్నారు. చిలమత్తూరులో ఉంటున్న సోమశేఖర్ అనే వ్యక్తి ద్వారా సబ్ రిజిస్ట్రార్‌కు నగదు లావాదేవీలు ఉన్నాయనే విషయమై గతంలో కేసు నమోదైంది. కోర్టు ఆదేశాలతో ఇవాళ మళ్లీ ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు.అనంతపురంలోని ప్రసాద్ బాబు ఇంట్లో, చిలమత్తూరు ఉంటున్న సోమశేఖర్ నివాసంలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నగదు బ్యాంకు లావాదేవీలు, ఇతర రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురంలోని రాజహంస గోల్డ్ హౌమ్స్?లో ఉన్న చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ బాబు ఇంట్లో కూడా ఏసీబీ తనిఖీలు చేపట్టారు. బ్యాంకు లావాదేవీలు, ఇతర రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం ఆయా రికార్డుల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. వీటి ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని ఏసీబీ అధికారులు వెల్లడించారు.'గత నెలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టాం. అందులో భాగంగా దొరికిన ఆధారాలు ఆధారంగా గవర్నమెంట్ పర్మిషన్‌తో కేసు రిజిష్టర్ చేశాం. సోమశేఖర్ నివాసంలో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నాం. బ్యాంకు లావాదేవీలు, ఇతర రికార్డులను పరిశీలించాం. వీటి ఆధారంగా వివరాలు సేకరిస్తాం.' ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు: ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ పంజా విసిరింది. తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. కార్యాలయంతో పాటు విజయవాడ భవానీపురంలో నివాసం ఉంటున్న ఇంఛార్జ్ సబ్ రిజిస్టర్ మహమ్మద్ ఇంట్లో తనిఖీలు చేశారు. కొండపల్లిలో జూనియర్ అసిస్టెంట్ దివ్య నివాసంలోనూ ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. మరోవైపు గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. విజయనగరం జిల్లాలోని భోగాపురం, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు, నెల్లూరు జిల్లాలోని స్టోన్‌హౌస్‌పేట, విశాఖపట్నం జిల్లాలోని మధురవాడ, పల్నాడు జిల్లా నరసరావుపేట తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనిశా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక దాడులు చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో అధికారులు మెరుపు దాడులు చేశారు. బయట వ్యక్తులను అనుమతించకుండా కార్యాలయం గేట్లు కూడా మూసేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి విచ్చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కూడా తనిఖీ చేస్తున్నామని ఏసీబీ అధికారులు వివరించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు!



**మొదటిపేజీ తరువాయి** - చేశారు. తనతో పాటు ఎందరో నేతల ఫోన్లను ట్యాప్ చేయడమే కాకుండా, కుటుంబాల్లో చిచ్చు పెట్టారని విమర్శించారు. "కన్నబిడ్డ, అల్లుడి ఫోన్లనూ ట్యాప్ చేయించి, ఎంతో పేరున్న ఎస్ఐబీ వ్యవస్థను భ్రష్టు పట్టించారు" అని మండిపడ్డారు. ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టర్లు, నేతల నుంచి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.అయితే, ఈ విచారణపై ఆయన పలు సందేహాలు వ్యక్తం చేశారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా, లేక దోషులను తేలుస్తారా అని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసు మొదలైనప్పుడు ప్రారంభమైన టీవీ సీరియళ్లు కూడా పూర్తయ్యాయి కానీ, ఈ కేసు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది" అని ఎద్దేవా చేశారు. విచారణ అధికారులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, ఈ కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను బయటపెట్టాలని ఆయన కోరారు.

## వైకుంఠ ద్వార దర్శనాలపై వదంతులు నమ్మొద్దు



**మొదటిపేజీ తరువాయి** - చేశారు. దర్శనాల షెడ్యూల్‌పై ఆయన స్పష్టతనిస్తూ, భక్తులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని కోరారు.డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో ఈ-డిప్ టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆ మూడు రోజుల్లో టోకెన్లు లేని వారికి దర్శనం ఉండదని, అయితే జనవరి 2 నుంచి 8 వరకు సర్వదర్శనం క్యూలైన్ల ద్వారా దర్శించుకోవచ్చని తెలిపారు.టోకెన్లు లేని భక్తులు తిరుమలకు రావొద్దని చెప్పే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చిచెప్పారు. దర్శనం లేనప్పటికీ, తిరుమల క్షేత్రానికి వచ్చే భక్తులను ఎవరూ అడ్డుకోరని భరోసా ఇచ్చారు. నకిలీ దర్శనం టికెట్ల అమ్మకాల వంటి ఘటనల నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, భక్తుల రద్దీని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు బీఆర్ నాయుడు వివరించారు. మంత్రుల సబ్ కమిటీ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులందరూ టీటీడీ సూచనలు పాటిస్తూ సంయమనంతో వ్యవహరించి, ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం



**మొదటిపేజీ తరువాయి** - ఉదయం 8.54 గంటలకు నిందిలోకి బ్లూబర్డ్-6 ఉపగ్రహం రాకెట్.ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3-ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది.శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

## ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నాం



**మొదటిపేజీ తరువాయి** - పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు.తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

## ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో రేవంత్ బిజీగా ఉన్నారు



**మొదటిపేజీ తరువాయి** - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. నల్గొండ జిల్లాలో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రేవంత్‌రెడ్డి రెండేళ్లలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా, ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో మాత్రమే జోరుగా ఉన్నారని కేటీఆర్ మండిపడ్డారు. మీడియాకు లీకులు ఇవ్వడం, నోటీసుల డ్రామాతో ప్రజల దృష్టిని వేరే దిశగా మళ్లించడం చేస్తున్నారని విమర్శించారు.నదీ జలాలపై రేవంత్ కు ఏమాత్రం అవగాహన లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సాగునీటిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటిందని... రేవంత్ కు దమ్ముంటే సహకారసంఘాల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకపోవడం వల్లే రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని అన్నారు.

## దొంగచాటుగా ఏం చేస్తున్నావో బహిర్గతం చెయ్యి



**మొదటిపేజీ తరువాయి** - తీర్పు... ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్‌కు చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. ఈ విషయంపై హరీశ్ రావు స్పందిస్తూ.. "ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, జీవోలను దాచిపెడుతూ పెద్ద డ్రామా ఆడుతోంది. మా పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారంతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీంతో ప్రభుత్వ అసలు రంగు బయటపడబోతోంది" అని తెలిపారు.2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 26 వరకు మొత్తం 13 నెలల కాలంలో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేయగా, వాటిలో కేవలం 3,290 మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో పెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. "ఏకంగా 15,774 జీవోలను, అంటే 82 శాతం జీవోలను ఎందుకు దాచిపెడుతున్నారు? చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నారు? రేవంత్ రెడ్డి, ఇదేనా మీరు చెప్పిన ప్రజా ప్రభుత్వం?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తక్షణమే జీవోలన్నింటినీ బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# యావర్ రోడ్డు విస్తరణ జాప్యానికి ఎమ్మెల్యేనే కారణం కాదా..?

## మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి సూటి ప్రశ్న




**జగిత్యాల, డిసెంబర్ 23 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డు 100 ఫీట్ల విస్తరణ జాప్యానికి స్థానిక ఎమ్మెల్యేనే ప్రధాన కారణమని మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాల ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.మున్సిపల్ తీర్మానాన్ని తుంగలో తొక్కి, ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం యావర్ రోడ్డు విస్తరణను అడ్డుకున్నారని విమర్శించారు. ప్రజా ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు లేదా..? అని ప్రశ్నించారు.

**100 ఫీట్ల విస్తరణపై పూర్తి వివరాలు**

యావర్ రోడ్డును 100 ఫీట్లకు విస్తరించాలని 2017 జూన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం టౌన్ ప్లానింగ్ శాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందన్నారు.మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ఉన్నప్పటికీ, ఎమ్మెల్యే ఎన్నికైన తర్వాత రెండున్నర సంవత్సరాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. 2021 జూన్ 14న ప్రభుత్వం జీఓ నెంబర్ 94 జారీ చేసి 100 ఫీట్ల విస్తరణకు అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు.అయితే, 2023 ఆగస్టులో మాత్రమే టీడీఆర్ అంశాన్ని తెరపైకి తెచ్చారని, ఇది కావాలని చేసిన జాప్యమని ఆరోపించారు.

**ఆక్రమణలు - సెట్‌బ్యాక్‌లపై తీవ్ర విమర్శలు**

సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన అక్రమ భవనాలు, ప్రజా ఆస్తులపై జరిగిన ఆక్రమణలను తక్షణమే తొలగించాల్సిన బాధ్యత మున్సిపల్, ఎమ్మెల్యేలకు ఉందన్నారు.2008 తర్వాత టైటిల్ లేకుండా నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.కొత్త బస్టాండ్ వద్ద పెట్రోల్ బంక్ పేరిట జరిగిన ఆక్రమణలపై కోర్టు స్పష్టంగా టైటిల్ లేదని తేల్చిందని, అయినా ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు.సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాల వల్ల రోడ్లపై వాహనాల పార్కింగ్ జరుగుతోందని, ఇది ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు.

**ఎమ్మెల్యే వ్యాఖ్యలపై విమర్శ**

"యావర్ రోడ్డు విస్తరణ జరిగితేనే రాజకీయాల్లో కొనసాగుతా" అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనడం విడ్డూరమని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

పదేళ్లు అధికారంలో ఉండి కూడా విస్తరణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చర్యలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2024 జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి యావర్ రోడ్డు విస్తరణపై లేఖ రాసినట్లు తెలిపారు.దీనిపై సీఎం స్పందించి అధికారులను ఆదేశించగా, సుమారు 100 కోట్ల వ్యయం అవుతుందని కలెక్టర్ సీఎంకు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు.

**ప్రజా ఆస్తుల పరిరక్షణ నా బాధ్యత**

నాలుగు దశాబ్దాలుగా ప్రజా ఆస్తులు, దేవాలయ భూములను కాపాడిన చరిత్ర తనదని జీవన్ రెడ్డి తెలిపారు.బాధ్యత గల పౌరుడిగా ప్రజా ఆస్తుల సంరక్షణ కోసం పోరాడుతున్నానని, కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా ప్రజల తరఫున మాట్లాడుతున్నానన్నారు.

**స్పష్టమైన హెచ్చరిక**

ప్రజా ఆస్తుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగించడం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చేయవచ్చని, ఇది పూర్తిగా మున్సిపల్ బాధ్యత అని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే పదవి శాశ్వతం కాదని, రాజకీయ భవిష్యత్తు ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.ముందుగా అక్రమ నిర్మాణాలు, సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సమర్థ పనితీరు

## నేరాలు 5.05 శాతం తగ్గింపు

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల డిసెంబర్ 23 (ప్రజా మంటలు) :** పండుగలు, ఎన్నికలు, జాతరలు ప్రశాంతంగా - అవాంఛనీయ సంఘటన లేకుండా ముగిసిన ఏడాదిలి మహిళలు, చిన్నారుల భద్రతే ప్రథమ లక్ష్యం,- డ్రగ్స్ పై జీరో టాలరెన్స్ విధానం అమలు 'సురక్షిత ప్రయాణం'తో రోడ్డు ప్రమాదాల తగ్గింపునకు చర్యలు జిల్లాలో గత సంవత్సర కాలంలో జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన శాంతి భద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత చర్యలు మరియు సాధించిన ప్రగతిని జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో జిల్లా ఎస్పి అశోక్ కుమార్ వార్షిక ప్రెస్‌మీట్ ద్వారా వివరాలను వెల్లడించారు.గత సంవత్సరం జిల్లాలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించారు. పండుగలు, ఎన్నికలు, జాతరలు, భారీ సమావేశాల సమయంలో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడం జరిగింది. జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముఖ్యంగా హత్యలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్, ఆన్‌లైన్ మోసాలు వంటి కేసుల్లో నేరస్తులను త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది.అదే విదంగా పెండింగ్ కేసుల పరిష్కారంలో కూడా గణనీయమైన పురోగతి సాధించాం.మహిళలు, బాలల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది,ఇందుకోసం షీ టీమ్స్ , ఏ హెచ్ టి యు, భరోసా సెంటర్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. మహిళలపై జరిగే నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానం అమలు చేయడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్ అవగాహన కార్యక్రమాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాం.అదే విదంగా జిల్లా పోలీస్ శాఖ ద్వారా సురక్షిత ప్రయాణం, పోలీస్ పాఠశాల వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించడంలో విజయం సాధించాం.టెక్నాలజీని వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్ దిశగా అడుగులు వేయడం జరిగిందని , సి సి టి వి నెట్‌వర్క్, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకున్నాం అన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను అదుపులో ఉంచడం మరియు ప్రజలకు మెరుగైన భద్రత సేవలు అందించడంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అహర్నిశలు కష్టపడి చేసిన సేవలు ఉన్నాయి అని వారి నిబద్ధతకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.అదే విదంగా జిల్లా ప్రజలు పోలీసులకు అందిస్తున్న సహకారం అభినందనీయం అని భవిష్యత్తులో కూడా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని అన్నారు.

**నమోదైన నేరాలు:** 2025లో జిల్లాలో 5,620 నేరాలు నమోదు కాగా, 2024లో నమోదైన 5,919 కేసులతో పోలిస్తే 229 కేసులు తగ్గాయని తెలిపారు. 2024తో పోలిస్తే 2025లో నమోదైన కేసులు 5.05 శాతం తగ్గాయి.అత్యధిక నేరాలు: లిజగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ %-% 770 కేసులు. అత్యల్ప నేరాలు: లిబుగ్గారం పోలీస్ స్టేషన్ - 135 కేసులు నమోదు కావడం జరిగింది.హత్యలు, అత్యాచారాలు, అపహరణలు వంటి తీవ్ర నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేయడం జరిగింది. 2025లో మొత్తం 29 హత్య కేసులు నమోదయ్యాయి. కుటుంబ కలహాలు , ఆస్తి వివాదాలు, కట్న హత్యలు, చిన్నచిన్న గొడవలు ప్రధాన కారణాలుగా ఉన్నాయని తెలిపారు.

**ప్రాపర్టీ కేసులు(దొంగతనాలు):** 2025లో 381 ప్రాపర్టీ కేసులు నమోదు కాగా, వాటిలో 187 కేసులు చేధించి రూ. ?2,92,37,439/ విలువైన ఆస్తి రికవరీ చేయడం జరిగింది. రికవరీ శాతం(69.85%).

ఎస్సీ/ ఎస్టి కేసులు:మొత్తం 104 కేసులు నమోదు కాగా, గత ఏడాదితో పోలిస్తే 5 కేసులు తగ్గాయి.

పీడీఎస్ రైస్ కేసులు:19 కేసులు నమోదు చేసి, 1,135.69 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా:234 కేసులు, 410 నిందితులు, 260 వాహనాలు స్వాధీనం.

గేమింగ్ యాక్ట్:167 కేసులు నమోదు చేసి, ?30,62,036/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్: మొత్తం 9,290 కేసులు నమోదు చేయగా, 14 మందికి జైలు శిక్షలు విధించబడ్డాయి.

జిల్లా పోలీస్ శాఖ ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 600 మంది పోలీసులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు.2026 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ, స్నేహపూర్వక పోలీసు విధానాన్ని అవలంబిస్తూ, జిల్లా పోలీస్ శాఖ బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో, పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజల రక్షణ కోసం అనుక్షణం పనిచేస్తామని తెలుపుతూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పి శ్రీ శేషాద్రిని రెడ్డి , డిఎస్పి లు వెంకటరమణ, వెంకటరమణ, రఘు చందర్, రాములు ఇన్స్పెక్టర్ లు పాల్గొన్నారు.

# జాతీయ రైతు దినోత్సవ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే డా .సంజయ్ కుమార్

**జగిత్యాల డిసెంబర్ 23 (ప్రజా మంటలు) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస లో మాజీ ప్రధాని చరణ్ సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవం (కిసాన్ దివస్) కార్యక్రమం లో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.అంతకుముందు మాజీ ప్రధాని చరణ్ సింగ్ చిత్ర పటానికి పూలు సమర్పించి ఘన నివాళులు అర్పించడం జరిగింది.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ**

పూర్వకాలపు సంప్రదాయ నత్రజనినీ మనం వాడడం మర్చిపోయాం..రైతు కుటుంబం నుండి వచ్చిన ముఖ్యమంత్రి రైతు పక్షపాతి.ఆధునిక టెక్నాలజీ వాడడం,ఆన్లైన్ లో వ్యవసాయ పద్దతులు పాటించడం తో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకోవడం మంచిది.తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా రావడం జరిగింది అని కొందరు ఉద్దేశ పూర్వకంగా అసత్య ప్రచారాలు చేయటం వల్ల కొందరు రైతులు ముందస్తు యూరియా నిల్వ చేసుకోవడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడడం జరిగిందన్నారు.రైతు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. రైతులు అత్యాధునిక పద్ధతులు ఉపయోగించుకోవాలి..భూసార పరీక్షలను రైతులు ఉపయోగించుకోవాలి.. డిమాండ్ తగ్గట్లు పంటలు పండించినపుడు రైతులకు లాభం కలుగుతుందని,మంచి నాణ్యమైన ఉత్పత్తులతో ఎగుమతులు చేపట్టి ఆదాయం పొందవచ్చు అని రైతులు ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ డి ఆర్ హరీష్ కుమార్ శర్మ, డీన్ భారతి, ఏడిఏ భాస్కర్,పోలాస సర్పంచ్ శంకరయ్య,మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి మహేశ్వర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, కట్ట రాజేందర్,సురేందర్ నాయక్, చిర్ర నరేష్, ములసపు మహేష్ ,దమ్మ



సురేందర్ రెడ్డి, దనేశ్వర్ రావు,రాజేశ్వర్ రెడ్డి,రాజిరెడ్డి, మహేష్, హరీష్,గంగారెడ్డి, రామ్ రెడ్డి, మల్లేశం,శాస్త్ర వేత్తలు, విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ విధులు సమర్థంగా నిర్వహించాలంటే శారీరకృఢత్వం మానసిక ఆరోగ్య ము అత్యంత అవసరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల డిసెంబర్ 23 (ప్రజా మంటలు) :** పోలీస్ విధులు సమర్థంగా నిర్వహించాలంటే శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆధునిక వ్యాయామశాల (జిమ్)ను మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది రోజువారీ విధుల్లో అనేక ఒత్తిళ్లు, దీర్ఘకాలిక డ్యూటీలు, రాత్రి పహారాలు, అత్యవసర పరిస్థితుల్లో పని చేయాల్సి ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో శారీరక ఫిట్‌నెస్ ఎంతో కీలకమని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని స్పష్టం చేశారు.ఈ జిమ్‌లో ఆధునిక వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ఖాళీ సమయాల్లో వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వ్యాయామాన్ని రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా పోలీస్ విధుల్లో ఎంతో అవసరమని అన్నారు.పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన ప్రాధాన్యాలలో ఒకటని,ఈ జిమ్ ద్వారా సిబ్బందిలో ఉత్సాహం పెరిగి, విధుల్లో మరింత సమర్థత సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు కష్టపడుతున్న పోలీస్ సిబ్బందికి ఇలాంటి సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్,రాములు ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్, రఫీక్ ఖాన్, కిరణ్ కుమార్, వేణు, సైదులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఎక్కువగా మానసిక ఒత్తిడికి గురి కావద్దు

## సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్



**ఎల్కతుర్తి 23 డిసెంబర్ ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలంలో కే జీ బి వి లో మానసిక ఆరోగ్యం గురించి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ తరపున డాక్టర్ ప్రహసిత్ సైకియాట్రిస్ట్ విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థులు శరీరకంగా మానసికంగా ధ్రుడంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారు. పరీక్షల సమయంలో ప్రణాళిక బద్ధంగా రూపకల్పన చేసుకుని చదవాలని అలాగే ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఉండాలని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం సాధన దిశగా కృషి చేయాలన్నారు. మానసిక ఆరోగ్య సమస్య చెప్పుకోవడానికి వెనకాడకూడదని సూచించారు. పరీక్షలలో పాస్ అవుతామా ఫెయిల్ అవుతామా అని భయపడకుండా పట్టుదలతో చదవాలని సూచించారు. అలాగే విద్యార్థిని విద్యార్థులు గంజాయి, కొకేన్, సిగరెట్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వీటివల్ల జరిగే నష్టాల గురించి వివరించడం జరిగింది. ప్రతి పాఠశాల 100 గజాల ఆవరణంలో ఎలాంటి పొగాకు సంబంధించిన ఉత్పత్తులు అమ్మకూడదని సూచించారు. అలాగే చెడు వ్యాసనాలకు బానిసలు అయినా వాటి నుండి విముక్తి పొందడానికి 14,416 టెలి మనాస్ కి కాల్ చేసి మీ సమస్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు. అలాగే విద్యార్థుల సమస్యలు తెలుసుకుని వాటి నుండి ఎలా బయటపడాలో తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేజీ బి.వి పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ రాజశేఖర్, డాక్టర్ మునీబు, సి హెచ్ ఓ నారాయణ, హెల్త్ అసిస్టెంట్ రాజు కుమార్, సోషల్ వర్కర్ నరేష్, మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర ఘాట్లను పర్యవేక్షించిన దేవాదాయ శాఖ




**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 23( ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని పుష్కర ఘాట్ల అభివృద్ధి కొరకు కావలసిన పనులను పర్యవేక్షించిన గౌరవ అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్, జగిత్యాల మరియు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ హైదరాబాద్ వారి కార్యాలయ అధికారులు మరియు ఇబ్రహీంపట్నం తాసిల్దార్, ఎంపీడీవో ఇతర మండల అధికారులు పాల్గొనడం జరిగినది.

# మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కిషన్ నాయక్‌పై సోదాలు




**మహబూబ్‌నగర్, డిసెంబర్ 23 (ప్రజా మంటలు) :** మహబూబ్‌నగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవాణా శాఖాధికారి కిషన్ నాయక్ పై అవినీతి నిరోధక శాఖ అధికారులు భారీ ఎత్తున సోదాలు నిర్వహించారు. అధికార ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసి ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం.కిషన్ నాయక్‌కు సంబంధించిన మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోని నివాసాలు, అనుమానాస్పద ఆస్తులు, బంధువులు మరియు సన్నిహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు కొనసాగాయి. ఉదయం తొలుత ప్రారంభమైన ఈ తనిఖీల కోసం ఏసీబీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.సోదాల సందర్భంగా కీలక ఆస్తి పత్రాలు బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన రికార్డులు నగదు, విలువైన వస్తువులు సేకరించినట్లు వర్గాలు వెల్లడించాయి. కొన్ని ఆస్తులు బెనామీ పేర్లపై నమోదు చేసినట్లు అనుమానం ఉండటంతో వాటి మూలాలను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.రవాణా శాఖలో విధులు నిర్వహిస్తూ అక్రమ మార్గాల్లో సంపాదించారని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. సోదాలు పూర్తయ్యాక మొత్తం ఆస్తుల విలువ, అక్రమ సంపాదన పరిమాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసీ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి



**భీమదేవరపల్లి, డిసెంబర్ 23 (ప్రజామంటలు) :** ముల్కనూర్ మేజర్ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన జాలి ప్రమోద్ రెడ్డిని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి ఆమె ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, ఉపాధ్యక్షురాలు సుహాసిని, ముస్తఫాపూర్ నూతన వార్డు సభ్యురాలు మంజుల మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనం

## జిల్లా సహాయ కార్యదర్శి, మండల అధ్యక్షుడు సదానిరంజన్ సిద్ధాంతి



**ఎల్కతుర్తి డిసెంబర్ 23 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానం ఆలయ అర్చకులు ధూపదీప నైవేద్య అర్చక సంఘం హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మరియు ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనం తేదీ, 24/12/2025 బుధవారం స్థలం, తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపం హనుమకొండ జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ దౌలతాబాద్ వాసుదేవ చర్మ ఆదేశాలతో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రతి ధూప దీప నైవేద్య అర్చకుడు తప్పనిసరిగా హాజరై సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ధూపదీప నైవేద్య అర్చకులు పాల్గొన్నారు.

# 10వ విద్యార్థులకు గణిత ప్రతిభ పోటీ పరీక్షలు



**భీమదేవరపల్లి, (ప్రజా మంటలు) :** 10వ తరగతి విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి, నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ గణిత ఫోరం భీమదేవరపల్లి ఆధ్వర్యంలో గణిత ప్రతిభ పోటీ పరీక్షలను తెలంగాణ మోడల్ స్కూల్ ముల్కనూర్ లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సునీత రాణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. జడ్పిహెచ్ఎస్ గట్ల నర్సింగాపూర్ సృజన, అంజన్న, మల్లారం వెంకటేశ్వర్లు, కేజీబీవీ భీమదేవరపల్లి లక్ష్మి, ఆదర్శ పాఠశాల, ముల్కనూర్, అక్షర బిందు రెసిడెన్షియల్ స్కూల్ వంగర, సాయి శ్రీ, శిరీష ఈ సందర్భంగా మండల గణిత ఫోరం అధ్యక్షులు దాసరి రవీందర్ మాట్లాడుతూ, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచడమే కాకుండా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే దిశగా దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గణిత ఉపాధ్యాయులు స్రవంతి, ఆచరిత, లావణ్య, రాధిక, స్వర్ణలత, ఉషారాణి, అనిల్, కిరణ్, శ్రవణ్ కుమార్, కృష్ణమూర్తి, ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బంగ్లాదేశ్ లో హిందూ హత్య..

## ప్రపంచ మానవ హక్కుల కమిషన్ లో పిటిషన్



**సికింద్రాబాద్, డిసెంబర్ 23 (ప్రజా మంటలు) :** బంగ్లాదేశ్‌కు చెందిన దీపు చంద్ర దాస్ దారుణ హత్యోదంతంపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామా రావు ఇమ్మానేని అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను /26580గా నమోదు చేసినట్లు, దీనిపై విచారణ చేపట్టనున్నామని వెబ్ సైట్ ద్వారా కౌన్సిల్ వర్గాలు వెల్లడించాయి.దీపు చంద్ర దాస్ హత్య ఘటనతో బంగ్లాదేశ్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న హింస అంతర్జాతీయ సమాజం దృష్టికి వచ్చిందని రామా రావు పేర్కొన్నారు. మతపరమైన మైనారిటీల రక్షణ, మానవ హక్కుల ఉల్లంఘనలపై అంతర్జాతీయ స్థాయిలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో ఆయన కోరారు.

# విదేశాల్లో చదివే భారతీయుల్లో ఏపీ విద్యార్థులే టాప్ - నీతి ఆయోగ్ వెల్లడి

**ప్రవాసంలో విద్యపై భారతీయుల ఖర్చు రూ.6.2 లక్షల కోట్లు**

**పశ్చిమబెంగాల్, తెలంగాణలు టాప్-10 స్థానాన్ని కోల్పోయినట్లు నివేదిక**



విదేశాల్లో చదివే భారతీయ విద్యార్థుల్లో ఏపీ వాసులు అత్యధికంగా ఉన్నట్లు నీతి ఆయోగ్ తెలిపింది. 'ఇంటర్నేషనలైజేషన్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' (దేశంలో ఉన్నతవిద్య అంతర్జాతీయీకరణ) పేరుతో సోమవారం ఒక నివేదిక విడుదల చేసింది.దీని ప్రకారం 2016లో 46,818 మేర ఉన్న ఏపీ విద్యార్థుల సంఖ్య 2018 నాటికి 62,771కి పెరిగినట్లు వెల్లడించింది. అయితే కొవిడ్ కారణంగా 2020లో ఈ సంఖ్య 35,614కి తగ్గినట్లు తెలిపింది. అయినా ఇప్పటికీ ఏపీ విద్యార్థులే అగ్రస్థానంలో ఉన్నట్లు పేర్కొంది.తర్వాతి స్థానాల్లో పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, దిల్లీ, కర్ణాటక, కేరళ, యూపీలు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 2024 గణాంకాల ప్రకారం మొత్తం13.35 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. ఇందులో 8.5 లక్షల మంది అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాల్లోనే ఉన్నారు. 2016-24 మధ్య 8.84% వృద్ధి నమోదైందని తెలిపింది. భారతీయ విద్యార్థులు విదేశీ విద్య కోసం రూ.6.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది మన జీడీపీలో 2 శాతానికి సమానమని వివరించింది.విదేశీ చదువుల కోసం భారతీయ విద్యార్థులు చేసే ఖర్చు మన వాణిజ్య లోటులో 75 శాతానికి కారణం అవుతోందని నివేదికి వెల్లడించింది. మనదేశంలో చదువుకోవడానికి విదేశాల నుంచి సగటున ఒక విద్యార్థి మాత్రమే వస్తుంటే 28 మంది భారతీయ విద్యార్థులు బయటకు వెళ్లిపోతున్నట్లు తెలిపింది.2011 నుంచి ఇప్పటివరకూ 16 లక్షల మంది భారతీయ పౌరులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. వీరిలో అత్యధిక భాగం ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లినవారేనన్నది అంచనా. ఈ పరిస్థితులను మార్చాలని, విదేశీ విద్యార్థులు పెద్దఎత్తున భారతీయ విశ్వవిద్యాలయాల్లో చదివేలా ఆకర్షించాలని నీతి ఆయోగ్ పేర్కొంది.దేశంలో చదివే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను 2047 నాటికి 7.89 లక్షలకు తీసుకు వెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించింది. అప్పటికి దేశీయ విద్యార్థుల్లో ఒక శాతానికి సమానంగా విదేశీ విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. దేశంలో 2012-13 నుంచి 2021-22 మధ్యకాలంలో విదేశీ విద్యార్థుల సంఖ్య ఒక్క పంజాబ్‌లోనే 300% పెరిగినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఉత్తర్‌ప్రదేశ్, ఏపీ, గుజరాత్‌లు కూడా ఇందులో బలమైన వృద్ధినే నమోదు చేసినట్లు తెలిపింది.టాప్-10ను కోల్పోయిన ఆ రెండు రాష్ట్రాలు: పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాలు టాప్-10 స్థానాన్ని కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. కోల్‌కతాలో, హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. అయినా ఈ రెండు రాష్ట్రాలు విదేశీ విద్యార్థుల్ని ఆకట్టుకోవడంలో వెనుకబడినట్లు వెల్లడించింది. ఇకమీదట విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి విధానపరంగా 22 మార్పులు చేపట్టాలని ఉందని సిఫార్సు చేసింది. 24 రాష్ట్రాల్లో ఉన్న 160 ఉన్నత విద్యాసంస్థలు, 16 దేశాల్లో 30 విద్యాసంస్థలపై ఆన్‌లైన్ ద్వారా 100 ప్రశ్నలతో సర్వే నిర్వహించి నీతి ఆయోగ్ దీనిని రూపొందించింది.

భారతీయ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉన్న దేశాలు (2024నాటి లెక్కల ప్రకారం):-

| దేశం | విద్యార్థుల సంఖ్య |
|---|---|
| కెనడా | 4,27,000 |
| అమెరికా | 3,37,630 |
| బ్రిటన్ | 1,85,000 |
| ఆస్ట్రేలియా | 1,22,202 |
| జర్మనీ | 42,997 |
| యూఏఈ | 25,000 |
| రష్యా | 24,940 |
| కిర్గిస్థాన్ | 16,500 |
| జార్జియా | 16,093 |
| ఫిలిప్పీన్స్ | 9,665 |

**రాష్ట్రాలవారీగా విదేశాల్లో చదివే విద్యార్థుల సంఖ్య (2020):-**

| రాష్ట్రం | సంఖ్య |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 35,614 |
| పంజాబ్ | 33,412 |
| మహారాష్ట్ర | 29,079 |
| గుజరాత్ | 23,156 |
| దిల్లీ | 18,482 |
| తమిళనాడు | 15,564 |
| కేరళ | 15,277 |
| కర్ణాటక | 13,699 |

భారత్‌లో చదువుకు అత్యధిక సంఖ్యలో వస్తున్న విద్యార్థులు (2021-22):-

| దేశం | విద్యార్థుల సంఖ్య |
|---|---|
| నేపాల్ | 13,126 |
| అఫ్గానిస్థాన్ | 3,151 |
| అమెరికా | 2,893 |
| బంగ్లాదేశ్ | 2,606 |
| యూఏఈ | 2,287 |
| భూటాన్ | 1,567 |
| నైజీరియా | 1,387 |
| టాంజానియా | 1,264 |
| జింబాబ్వే | 1,058 |
| సూడాన్ | 982 |

# 'మత్తు'లో యువతరం

**కుటుంబాలను రోడ్డున పడేస్తున్న గంజాయి**

**'మత్తు'లో జోగుతున్న యువత**

**బాధితుల్లో 20 నుంచి 25 మధ్య గల వయసు వారే ఎక్కువ**

**చాక్లెట్ల పేరుతో జరుగుతున్న విక్రయం**

**పిల్లలకు ఇలాంటి విషయాలపై అవగాహన లేకపోవడమే కారణం**



ఈ తరం యువత చాలా త్వరగా చెడు అలవాట్లకు బానిసవుతోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించకపోవడమే ఇందుకు కారణం. క్షేత్రస్థాయిలో సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో దీని ప్రభావం వారి కుటుంబాలపై పడుతోంది. ముఖ్యంగా 20 నుంచి 25 మధ్య ఉన్న వయసు వారు గంజాయి తరలిస్తూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. దీన్ని పీలుస్తూ, విక్రయిస్తూ ఆ మత్తులో తూగుతున్నారు. నిత్యావసర సరకులు, ఇతర వస్తువుల పేరుతో దందా సాగిస్తున్నారు.ఇటీవల ఒక్క పరిగి ప్రాంతంలోనే మూడు కేసులు నమోదయ్యాయి. ఐదుగురి నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఈ ఒక్క ఏడాదిలోనే 85 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. అందులో 23 మందిపై కేసులు పెట్టారని తెలిపారు.ఈ ఏడాది ఫిబ్రవరి 12న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై 3.25 కిలోల గంజాయిని కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా, ఎక్సైజ్ పోలీసులు వారిని పట్టుకున్నారు. అనంతరం వారిద్దరిని రిమాండ్‌కు పంపించారు. పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గేటు సమీపంలో పరిగికి చెందిన ఒకరు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన మరో యువకుడి దగ్గరి నంచి 260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఏపీలో గత నెల 9న విశాఖ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న రైలులో గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం అందడంతో ఆబ్కారీ అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు 26 కిలోల ఎండు గంజాయిని వికారాబాద్ రైల్వే ఆసుపత్రి సమీపంలో స్వాధీనపర్చుకున్నారు. గంజాయి చాలావరకు కర్ణాటక రాష్ట్రం నుంచి ఇక్కడి జిల్లాకు సరఫరా అవుతోందని పోలీసులు అన్నారు. అమాయకులనే లక్ష్యంగా చేసుకుని కొందరు స్వార్థపరులు ఈ దందాను నడిపిస్తున్నారని చెప్పారు. ఈ ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారని అధికారులు తెలిపారు. అలాగే నిరంతరం పర్యవేక్షిస్తునే ఉన్నారని అన్నారు. అయినప్పటికీ ఈ విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదన్నారు. పరిగి, వికారాబాద్, మోమిన్‌పేట, తాండూరు, బషీరాబాద్ వంటి తదితర ప్రాంతాల్లో తరచూ కేసులు నమోదవుతూనే ఉన్నాయని తెనిపారు.ఇక్కడ రైలు సదుపాయమూ ఉండటంతో తాండూరు, వికారాబాద్ మీదుగా రవాణా అవుతోందని చెప్పారు. పొరుగు జిల్లా సంగారెడ్డిలోనూ కేసులు కలకలం రేపుతున్నాయని అన్నారు. రంగారెడ్డి జిల్లా బాలానగర్ ప్రాంతంలోని పరిశ్రమల్లో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పరిగికి తక్కువ దూరం కావడంతో అక్కడి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు న్నాయని అన్నారు.విక్రయదారులు గంజాయిని వివిధ రూపాల్లో అందిస్తున్నారని సమాచారం. గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారని అన్నారు. నాలుగు నెలల కిందట రంగారెడ్డి జిల్లా కొందర్గు నుంచి తెచ్చి పరిగిలో విక్రయిస్తున్నట్లు అనుమానం రావడంతో వారిని పట్టుకుందామని కృషి చేశారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు వెనక్కి వెళ్లిపోయారని చెప్పారు. పోలీసు, ఆబ్కారీ అధికారులు తనిఖీలు విస్తృతం చేసి ఈ గంజాయిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.తెలంగాణలో మత్తు దందాను అరికట్టేందుకు ఈగల్ టీం ఏఐ టూల్స్‌ను సిద్ధం చేసింది. సహాయ్, షీల్డ్‌పేరుతో తెలంగాణ ఈగల్ వెబ్‌సైట్‌లో పెట్టింది. ఎవరైనా తమకు డ్రగ్స్ గురించి ఎలాంటి సమాచారం తెలిసినా ఇందులో పంచుకునేలా రూపొందించారు. మరోవైపు షీల్డ్ పేరుతో రూపొందించిన ఏఐ టూల్‌తో అనుమానాస్పద పరిస్థితులు ఉంటే ఎక్కువ ప్రమాద స్థాయి, లేకపోతే ముప్పు తక్కువగా ఉన్నట్లు ఇది గుర్తిస్తుంది. ఇక్కడ ఎవరిని సంప్రదించాలో ఫోన్ నంబరు కూడా తెరపై ప్రత్యక్షం అవుతుంది.

# దుర్గగుడిలో భక్తుల సేవల మెరుగుకు ప్రక్షాళన చర్యలు

**పక్కాగా మూడంచెల ప్రణాళిక!**

**ఏడు ప్రధాన ఆలయాలపై ప్రభుత్వం జాబితా విడుదల**

**చివరి స్థానానికి పరిమితమైన దుర్గగుడి**

**ఏడాదిలో మార్పులు చేయాలనే లక్ష్యంతో ఆలయ అధికారులు**



విజయవాడ కనకదుర్గ ఆలయంలో భక్తుల సేవల మెరుగుకు ప్రక్షాళన చర్యలు ఆరంభమయ్యాయి. సేవల్లో సంతృప్తి స్థాయి ఆధారంగా ఇటీవల రాష్ట్రంలో 7 ప్రధాన ఆలయాలపై ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో దుర్గగుడి చివరి స్థానానికి పరిమితమైంది. దీంతో ఆలయ అధికారులు అంతర్మథనంలో పడ్డారు. ప్రస్తుతం 3 నెలలు, ఏడాదిలో ఎలాంటి మార్పులు చేయాలనే లక్ష్యంతో పక్కాగా మూడంచెల ప్రణాళిక రూపకల్పన చేశారు. దీనిలో భాగంగా భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే ఆలయ అధికారులు దీనిపై దృష్టి సారించారు.ఇకపై తాగునీటిని బాటిళ్ల రూపంలో అందించనున్నారు. ఆలయ పరిసరాల్లో15 తాగునీటి పాయింట్ల ఏర్పాటు చేయనున్నారు. మరుగుదొడ్లు కొత్తవి నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఘాట్‌రోడ్డు పై ట్రాఫిక్ రద్దీ తగ్గించేలా చర్యలు తీసుకోనున్నారు. వయోవృద్ధులు, వీఐపీలను కింద నుంచి దర్శనాలకు తీసుకు వెళ్లేందుకు వాహనాల ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి ప్లాంట్‌ను కొత్తగా నిర్మించనున్నారు. భక్తులు కూర్చునేందుకు వీలుగా వందకు పైగా బెంచీల ఏర్పాటు చేస్తున్నారు.తడి, పొడి చెత్త బుట్టలు వేర్వేరుగా పెట్టి, గతంలో కంటే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచారు. సూపర్‌వైజర్లను పెంచి, పారిశుద్ధ్య నిర్వహణ నిరంతర పర్యవేక్షణ వారి ద్వారా నిర్వహిస్తున్నారు. చెత్త నిర్వహణపై భక్తులకు అవగాహన పెంచుతున్నారు. త్వరగా భవన నిర్మాణాలు పూర్తి అయితే నిర్మాణ సామగ్రి తొలగించేందుకు సాధ్యం అవుతుంది.ఆలయ అధికారులు భక్తుల దర్శనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సెక్యూరిటీ సిబ్బందితో క్యూలైన్ల క్రమబద్ధీకరణ చేస్తున్నారు. గంటకోసారి క్యూలైన్ల శుభ్రత చెక్ చేస్తున్నారు. తాగునీరు, మజ్జిగ క్యూలైన్లలో వేచివున్న వారికి అందజేస్తున్నారు. క్యూలైన్లు దర్శనాలకు మరింత అనువుగా ఉండేలా మార్పులు చేయనున్నారు. ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కోసం నూతనంగా లిఫ్ట్‌ల ఏర్పాటు చేశారు. మహామండపం ఏడో అంతస్తులో భక్తులు వేచి ఉండేందుకు వీలుగా సౌకర్యాల కల్పన.ఉదయం నుంచి రాత్రి వరకు కూడా ఉచిత ప్రసాదాల పంపిణీ అందిస్తున్నారు. అన్న ప్రసాదం ఎక్కువ మందికి అందించాలనే ఉద్దేశ్యంతో చర్యలు తీసుకుంటున్నారు. లడ్డూ, పులిహోర, చక్కెర పొంగలి నాణ్యతను చూసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. అన్నదాన భవనంలో బెంచీకి ఇద్దరు పర్యవేక్షకులను నియమించారు. వారు భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఉదయం వేళ అల్పాహారం ఏర్పాటుతో పాటు వారాంతాలు, పర్వదినాల్లో క్యూలైన్లలో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నారు. అదే విధంగా రాత్రి వేళ కూడా అన్నప్రసాదం నిర్వహిస్తున్నారు. ఏడాదిలో నూతన అన్నదానం, ప్రసాదాల తయారీ భవనాలు అందుబాటులోకి తీసుకురానున్నారు.ఐవీఆర్ఎస్ ద్వారా భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాల సేకరణ మేరకు ప్రభుత్వం ర్యాంకులను కూడా విడుదల చేసింది. ఆలయ సౌకర్యాల్లో ఏఏ అంశాల్లో ఎంత మేర సంతృప్తిగా ఉన్నారు వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| అంశం | సంతృప్త శాతం |
|---|---|
| తాగునీరు, వసతులు | 59.9 |
| పారిశుద్ధ్యం నిర్వహణ | 62.4 |
| దర్శనాలు | 67.9 |
| ప్రసాదం (రుచి, శుచి) | 75.7 |

మరోవైపు రాష్ట్రంలోని దేవాలయాల్లో డిజిటల్ చెల్లింపులను పెంచాలని ప్రభుత్వం సీరియర్?గా ఉంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 ప్రధాన ఆలయాలకు ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించింది. దీనిలో భాగంగా విజయవాడ కనకదుర్గగుడిలో ఇకపై సేవలను పూర్తిగా డిజిటల్ రూపంలోకి మారుస్తున్నారు. భక్తులకు క్యూలైన్లలో నిలబడే ఇబ్బంది ఇక ఉండదు. దర్శనం టికెట్లు, ప్రత్యేక పూజలు, ఆర్జిత సేవలు అన్నీ ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వసతి గదుల కోసం కూడా డిజిటల్ పేమెంట్‌నే చేయాల్సిందే. చివరకు కేశఖండన టికెట్లు, లడ్డూ ప్రసాదం కౌంటర్ల వద్ద కూడా డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి తీసుకురానున్నారు. హుండీ కాకుండా, ఆలయానికి ప్రత్యేకంగా ఇచ్చే విరాళాలు ఇకపై ఆన్‌లైన్ ద్వారానే స్వీకరించనున్నారు.

# రాష్ట్రంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సాంకేతికత

**విద్యుత్‌ను దాచుకోవచ్చు అవసరంలో వాడుకోవచ్చు**

**రాష్ట్రంలో 1000 మెగావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులు**

**ఏడు ప్రాంతాల్లో ఏర్పాటు**

**పీక్ సమయంలో తక్కువ ధరకు విద్యుత్**




రాష్ట్రంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ విద్యుత్ సాంకేతికత వినియోగంలోకి రాబోతోంది. 2,000 మెగావాట్ అవర్ (1000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్ల ద్వారా ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున విద్యుత్ నిల్వ) బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇంధన శాఖ టెండర్లు ఖరారు చేసింది. మెగావాట్‌కు నెలకు సగటున రూ.1,58,575 చొప్పున అతి తక్కువ రేటును గుత్తేదారులు కోట్ చేశారు. రాష్ట్రంలో ఏడు ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు ఆ శాఖ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా నిల్వ చేసిన విద్యుత్ 12 ఏళ్ల పాటు అందుబాటులో ఉంటుంది. దీనివల్ల పీక్ డిమాండ్ సమయంలో యూనిట్ విద్యుత్ రూ.4.38కే లభిస్తుంది. సుమారుగా ఏడాది కాలంలో ఇవి అందుబాటులోకి రావచ్చని అంచనా.రాష్ట్రంలో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల ద్వారా 12 ఏళ్ల పాటు సేవలు అందుతాయని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. వీటి ద్వారా 95 శాతం విద్యుత్ నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉంటుందని అంచనా వేస్తున్నారు. యూనిట్ విద్యుత్ నిల్వకు సగటున రూ. 1.68 చొప్పున ఖర్చు అవుతుందని అధికారులు లెక్కలు తేల్చారు. నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ నిర్వహించే బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా యూనిట్ విద్యుత్ నిల్వకు రూ. 2.15 చొప్పున ఖర్చు అవుతోందని నిపుణులు వివరిస్తున్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో ఏర్పాటు చేసే 1,000 మెగావాట్ల ప్రాజెక్టులో నిల్వ చేసే విద్యుత్ ద్వారా రూ.910 కోట్లు ఆదా అవుతుందని అధికారులు లెక్కలు వేశారు.పీక్ డిమాండ్ సమయంలో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.10 చొప్పున డిస్కంలు కొంటున్నాయి. దీనివల్ల కొనుగోలు వ్యయం పెరిగి వినియోగదారులపై ట్రూఅప్ భారం పడుతోంది. బ్యాటరీ ప్రాజెక్టుల ఏర్పాటుతో విద్యుత్ కొనుగోలు వ్యయం భారీగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఉదయం పీక్ డిమాండ్ సమయంలో రెండు గంటలు, సాయంత్రం పీక్ డిమాండ్ వేళల్లో రెండు గంటల చొప్పున బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు.పీక్ డిమాండ్ సమయంలో యూనిట్ విద్యుత్ రూ.4.38 ధరకు అందుబాటులోకి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులకు యూనిట్‌కు చెల్లించే స్థిర ఛార్జీలు రూ.1.68, యూనిట్ విద్యుత్ కొనుగోలుకు రూ.2.70 చొప్పున (మైలవరం సౌర ప్రాజెక్టు ద్వారా యూనిట్ రూ.2.70 చొప్పున అందుతుంది) డిస్కంలు చెల్లిస్తాయి.రాష్ట్ర విద్యుత్ రంగంలో కొత్త సాంకేతికత అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకు సౌర, పవన, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టులు మాత్రమే ఉండగా ఇకపై బ్యాటరీ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టులూ ఏర్పాటు కానున్నాయి. ఏపీలో వెయ్యి మెగావాట్ల నిల్వ సామర్థ్యంతో వాటిని నెలకొల్పేందుకు కేంద్రం అనుమతించింది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా నాలుగుచోట్ల ఆయా ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం వయబులిటి గ్యాప్ ఫండ్ అందించనుండటంతో ఆంధ్రప్రదేశ్‌పై యూనిట్ వ్యయం కూడా తగ్గనున్నట్లు గతంలోనే అధికారులు తెలిపిన సంగతి విదితమే.కేంద్ర ప్రభుత్వం అందించే వయబులిటి గ్యాప్ ఫండ్ వల్ల యూనిట్‌కు 70 పైసల భారం తగ్గనుంది. ఈ ప్రాజెక్టుతో అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి.ఐ

# ఒక్కడే రూ.లక్ష కండోమ్స్ ఆర్డర్

**రూ.16 లక్షల రెడ్ బుల్స్‌కు మరొకరి ఆర్డర్**

**2025లో ఇన్‌స్టామార్ట్ లెక్కలు ఇలా!**

**రూ.లక్ష విలువచేసే కండోమ్‌లు కొన్న చెన్నైవాసి**


**ఈ ఏడాది 228 వేర్వేరు ఆర్డర్ల ద్వారా కొనుగోలు**

**ఇన్‌స్టామార్ట్‌కు వచ్చిన ప్రతి 127 ఆర్డర్లలో 1 ఆర్డర్ కండోమ్‌దే**

**అసాధారణ ఆర్డర్ల వివరాలతో ఇన్‌స్టామార్ట్-2025 నివేదిక**



చెన్నైకు చెందిన ఓ వ్యక్తి ఈ ఏడాది ఏకంగా రూ.లక్ష విలువ చేసే కండోమ్‌లు కొన్నాడు. ఇందుకోసం స్విగ్గీకి చెందిన క్విక్ కామర్స్ వేదిక ఇన్‌స్టామార్ట్‌లో 228 వేర్వేరు ఆర్డర్లు పెట్టాడు. ఈ ఏడాది ఇన్‌స్టామార్ట్‌కు వచ్చిన ప్రతి 127 ఆర్డర్లలో 1 ఆర్డర్ కండోమ్‌దే కావడం గమనార్హం. కండోమ్‌ల ఆర్డర్లు ఈ ఏడాది సెప్టెంబరులో 24 శాతం పెరిగాయని ఇన్‌స్టామార్ట్ వెల్లడించింది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మూడు వేర్వేరు ఆర్డర్లతో మూడు ఐఫోన్-17లను కొన్నాడు. ఇతడి మూడు ఆర్డర్ల మొత్తం విలువ రూ.4.30 లక్షలు. 2025 సంవత్సరంలో వచ్చిన ఇలాంటి అసాధారణ ఆర్డర్ల విశేషాలతో హౌ ఇండియా ఇన్‌స్టామార్టెడ్ 2025 శీర్షికన ఒక నివేదికను ఇన్‌స్టామార్ట్ విడుదల చేసింది. దానిపై ఓ లుక్కేద్దాం.




PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com